మట్టపల్లి ఆలయంలో జడ్జి గోవర్ధన్‌రెడ్డి పూజలు

జడ్జికి స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్

మఠంపల్లి, జూన్ 9 : మండలంలోని మట్టపల్లిలో గల లక్ష్మీనరసింహస్వామి వారిని సూర్యాపేట జిల్లా ప్రిన్సిపల్ జడ్జి గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన పాలక వర్గం, అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద మంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. ఆలయ చరిత్ర, స్వామి వారి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, హుజూర్‌నగర్ సబ్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

● కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కట్టమైసమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మోతె, జూన్ 9 : దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కావునా ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉర్లుగొండ గ్రామంలో గట్టు మైసమ్మ తల్లి పండుగ మహోత్సవంలో పాల్గొని పూజలు చేసి మాట్లాడారు. గ్రామ ప్రజలందరూ మైసమ్మ తల్లి దీవెనలతో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు, జిల్లా నాయకులు ఏలూరు వెంకటేశ్వర్‌రావు, మండల నాయకులు నూకల యుగేంధర్‌రెడ్డి, మిక్కిలినేని సతీశ్, అనంతుల ఆంజనేయులు, గ్రామ శాఖ అధ్యక్షుడు కట్ట నరసయ్య, నాయకులు మామిడి సీతారాములు, గుండాల వీరస్వామి, చింతలపాటి రవి, బెల్లంకొండ రామ్మూర్తి, కొండ సతీశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జయ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కె.వెంకటేశ్ | జి.గోపి | జి.చందన | బి.హర్షిత

సూర్యాపేట అర్బన్, జూన్ 9 : జాతీయ స్థాయి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జయ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. కళాశాలకు చెందిన 12 మంది జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కె.వెంకటేశ్-293, బి.హర్షిత్-1,070, జి.గోపి-1,143, జి.చందన-1,864, జి.సిందు-2,717, ఎం.అక్షయ్-2,840, కె.సిద్ధార్థన్-3,067, పి.గౌతమ్-3,271, ఎం.హరిని-4,047, వి.మహేశ్-5,153, జి.అక్షయ్-5,421, జి.శశికుమార్-5,648, పి.కౌషిక్-7,092 జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను జయ వేణుగోపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

● సిరి ఫౌండేషన్ చైర్మన్ గోపి

వెంకట్రామాపురంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిరి ఫౌండేషన్ చైర్మన్ గోపి

నడిగూడెం, జూన్ 9 : ప్రకృతి వ్యవసాయంతో లాభాలు సాధించవచ్చని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. నేల ఆరోగ్యం కోసం పచ్చిరొట్ట ఎరువులు, పశువుల పెంట, జీవామృతం వంటివి ఉపయోగించాలన్నారు. చీడపీడల నివారణ కోసం వేప గింజలు, వేప ఆకుల ద్రావణాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

లేబర్ కార్డుల అందజేత

లేబర్ కార్డులను అందజేస్తున్న నాగరాజు

నడిగూడెం, జూన్ 9 : లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మండల లేబర్ కార్డు నిర్వాహకుడు మేకల నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని కేశవాపురం గ్రామంలో పలువురికి లేబర్ కార్డులను అందించి మాట్లాడారు. లేబర్ కార్డుతో అనేక ఉపయోగాలు ఉన్నాయని, 18 నుంచి 55 ఏండ్ల వయస్సు వారు ఈ కార్డును పొందవచ్చని తెలిపారు.

'నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలి'

నడిగూడెం, జూన్ 9 : నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేశబోయిన మురళీకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఒకే సెంటర్‌లో ఆరుగురు ఫస్ట్ ర్యాంక్‌లు సాధించడం, అదే సెంటర్‌లో సెకండ్ ర్యాంక్ రావడం అనుమానాస్పదంగా ఉన్నట్లు తెలిపారు. మార్కులకు సంబంధం లేని విధంగా ఫలితాల్లో ర్యాంక్‌లను ఇవ్వడమనేది పరీక్షకు ముందే పేపర్ లీక్ జరిగిందా అనే అనుమానాలకు తావిస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పుల్లారావు

చిలుకూరు, జూన్ 9 : సూర్యాపేట జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చిలుకూరు గ్రామానికి చెందిన యడవెల్లి పుల్లారావు నియమితులయ్యారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో తనను ఎన్నుకున్నట్లుగా ఆయన ఆదివారం తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇంటర్నేషనల్ ఫవర్ లిఫ్టర్ పాలడుగు ఖ్యాతి, ఉపాధ్యక్షుడిగా భాస్కర విజయ్, కోశాధికారిగా సోమగాని ఈశ్వర్, జాయింట్ సెక్రటరీగా సంక్రాంతి విజయ్‌శేఖర్ నియమితులైనట్లు చెప్పారు. తమ నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● ఎంఈఓ శైలజ

సూర్యాపేట అర్బన్ : జిల్లా కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ శైలజ, ఉపాధ్యాయులు

సూర్యాపేట అర్బన్, జూన్ 9 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నట్లు ఎంఈఓ శైలజ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతో పాటు అనుభవం కలిగిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో సెక్టోరియల్ అధికారి రాంబాబు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, అనిల్‌కుమార్, యాకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ధనమూర్తి పాల్గొన్నారు.

నూతనకల్, జూన్ 9 : మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాటలో భాగంగా బడికి పంపడం మీ వంతు చదువు చెప్పడం మా వంతు అంటూ గ్రామంలో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచిత దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు ప్రభుత్వమే అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే విశాలమైన గదులు, క్రీడా స్థలం, మినరల్ వాటర్, డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం విద్యాసాగర్, ఉపాధ్యాయులు రేపాక లింగయ్య, రామాచారి, సైదులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నేరేడుచర్ల : బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల మెరుగైన వసతులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బట్టు మధు తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కందిబండ అనసూర్య, ఉపాధ్యాయులు సైదులు, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

హరితహారానికి సన్నద్ధం

- గ్రామ నర్సరీల్లో మొక్కలు సిద్ధం
- ఈ ఏడాది నేరేడుచర్ల మండలంలో 99,750 మొక్కలు నాటడమే లక్ష్యం

కల్లూరు గ్రామంలో నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

నేరేడుచర్ల, జూన్ 9 : నైరుతి రుతుపవనాల ప్రవేశంతో రాష్ట్రంలో వర్షాలు ప్రారంభమయ్యాయి. దాంతో మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. పదో విడుత హరితహారాన్ని విజయవంతం చేయడం కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం గ్రామాల్లోనే మొక్కల పెంపకానికి నర్సరీలను ఏర్పాటు చేసింది. వాటిలో కావాల్సిన మొక్కలను పెంచి సిద్ధం చేశారు. మొక్కలు నాటడానికి అనువైన స్థలాలను అధికారులు గుర్తించే పనిలో పడ్డారు. 10వ విడత హరిత హారంలో భాగంగా మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 99,750 మొక్కలు నాటాలని లక్ష్యంగా ఉన్నది. దానికి అనుగుణంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టారు. ఒక్కొక్క గ్రామ పంచాయతీలో 5 నుంచి 10 వేల మొక్కలు నాటాలని లక్ష్యాన్ని పెట్టుకున్నారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం

పదో విడుత హరితహారం కోసం గ్రామీణాభివృద్ధి శాఖ నర్సరీల్లో వివిధ రకాలైన మొక్కలు పెంచుతున్నది. కానుగ, నిమ్మ, దానిమ్మ, మందారం, గులాబీ, సీతాఫలం, చింత, టేకు తదితర మొక్కలు పెంచుతున్నారు. తొలకరి వర్షాలు కురవడంతో గ్రామాల్లో గుంతలను తవ్వించి సిద్ధంగా ఉంచాలని అన్ని పంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు ఏపీఓ శేఖర్ తెలిపారు.

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

చిలుకూరులో జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

చిలుకూరు, జూన్ 9 : ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవంను ఆదివారం ఆ సంఘం ఉపాధ్యాయులు చిలుకూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ సంఘం పాత్ర కీలకమైనదన్నారు. కార్యక్రమంలో నీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు యలగొండ శ్రీనివాస్, సురగాని లింగయ్య, సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు కొండా వెంకయ్య, గుండు ఆదినారాయణ, ఖన్నం సాహెబ్, కొండా ధనమూర్తి, వీరబాబు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో ఎస్‌జీటీలకు తీవ్ర నష్టం

● టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

బొడ్రాయిబజార్, జూన్ 9 : ఎస్‌జీటీలకు పదోన్నతుల్లో తీవ్ర నష్టం జరుగుతుందని తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్‌జీటీలకు భారీ పదోన్నతులని అసత్య ప్రచారం చేస్తూ 10 వేల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులకు గాను కేవలం 2,130 పోస్టులు చూపడం, వాటికి కేవలం డీఈఓ, టీటీసీ చేసిన ఎస్జీటీలు మాత్రమే అర్హులుగా ప్రకటించడం అన్యాయమని ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 10,479 బాషా పండిత, పీఈటీ పోస్టులను జీఓ 11, 12కు వ్యతిరేకంగా గత ప్రభుత్వం జారీ చేసిన జీఓ 2, 3, 9, 10 ప్రకారం అర్హత గల ఎస్జీటీలను కాదని ఏకపక్షంగా బాషా పండిత పీఈటీలకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. ఇక మిగిలిన ఎస్ఏ 5,123 పోస్టులు (మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, సోషల్, ఇంగ్లీష్) పోస్టులకు సంబంధిత సబ్జెక్ట్‌లో బీఈడీ చేసిన ఎస్జీటీలు, బాషా పండితులు, పీఈటీలు అర్హులని ఈ రకంగా చూస్తే ఎవరికి పదోన్నతుల్లో ఎక్కువ లబ్ధి చేకూరుతుందని ప్రశ్నించారు. ఎస్‌జీటీల్లో డీఎస్సీ 2000 వారికి కూడా పదోన్నతులు రావని, అదే బాషా పండితులు, పీఈటీలు డీఎస్సీ 2017 వరకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందుతారన్నారు. ప్రభుత్వం ఎస్‌జీటీలకు కూడా పీఎస్ ప్రధానోపాధ్యాయ పోస్టులు పెంచి పదోన్నతుల్లో న్యాయం చేయాలని లేకుంటే ఎస్‌జీటీలు ఎస్‌జీటీలుగానే పదవీ విరమణ పొందుతారని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

తిరుమలగిరి, జూన్ 9 : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని రాజానాయక్‌తండాలో ఆదివారం జరిగింది. రైతు మాలోతు చందులాల్‌కు చెందిన ఎద్దు వ్యవసాయ క్షేత్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ పద్ద గడ్డి మేస్తూ తీగలకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై చనిపోయింది. సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

గ్రామ దేవతల పండుగలు తెలంగాణ సంస్కృతిలో భాగం

● మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి : వెలిశాల గ్రామంలో బొడ్రాయి పండుగ సందర్భంగా పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి, జూన్ 9 : గ్రామ దేవతలకు పండుగలు నిర్వహించడం తెలంగాణ సంస్కృతిలో భాగమని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెలిశాల గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పండుగ మహోత్సవంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించి మాట్లాడారు. పూర్వకాలం నుంచి మన పూర్వికులు గ్రామ దేవతలకు పండుగలు నిర్వహించి ప్రజలు, పశువులు, జీవాలు ఆరోగ్యంగా ఉండాలని వేడుకునేవారన్నారు. అదే ఆనవాయితీగా గ్రామాల్లో బొడ్రాయి పండుగలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరామర్శ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల ఎంపీపీ మన్నె రేణుక భర్త లక్ష్మీనర్సయ్యయాదవ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట సూర్యాపేట జడ్పీటీసీ జీడి భిక్షం, పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, యుగేంధర్, సాంబయ్య ఉన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఏకలక్ష్మి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకురాలు ఏకలక్ష్మి

నాగారం, జూన్ 9 : ఈ నెల 10న తుంగతుర్తిలో ఉదయం 11 గంటలకు జరిగే సీపీఎం నియోజకవర్గస్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ నాయకురాలు ఏకలక్ష్మి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ విచ్చేసి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలన్నారు. ఆమె వెంట దేవరకొండ వెంకన్న, కడెం కుమార్, యాదగిరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

11న శ్రీనివాసపురంలో

మఠంపల్లి : ఈ నెల 11న హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్ తెలిపారు. మండల కేంద్రంలో కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు సయ్యద్ రన్‌మియా, కోటయ్య, పాడిచెట్టి రాము, సుబ్బయ్య, హరి పాల్గొన్నారు.

పైన కొబ్బరి చిప్పలు.. కింద ఆవుదూడలు | లారీలో అక్రమంగా తరలింపు

లారీలో పైన కొబ్బరి చిప్పల బస్తాలు ఉంచి కింద ఆవు దూడల తరలింపు

నూతనకల్, జూన్ 9 : అనుమానం రాకుండా పైన కొబ్బరి చిప్పలు ఉంచి అక్రమంగా లారీలో తరలిస్తున్న ఆవు దూడలను పోలీసులు గుర్తించి శనివారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బిక్కుమళ్ల గ్రామంలో 365 జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టాం. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి కొబ్బరి చిప్పల లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తున్న టీఎస్ 12యూడీ6308 నంబర్ గల లారీని ఆపి చెక్ చేయగా కొబ్బరి చిప్పల అడుగు భాగంలో 24 ఆవు దూడలను గుర్తించినట్లు తెలిపారు. ఆవు దూడలను హైదరాబాద్ గోషాలకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. లారీ డ్రైవర్ రామావత్ శరత్‌కుమార్, కోమాలి శ్రీను, వీరబాబు, పాతవతు రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీలో తుంగతుర్తి, మద్దిరాల ఎస్ఐలు ఏడుకొండలు, మధునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై విరిగిపడ్డ చెట్టు తొలగింపు

నాగారం బంగ్లాలో విద్యుత్ తీగలపై కూలిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

నాగారం, జూన్ 9 : మండలంలోని నాగారం బంగ్లా గ్రామం వద్ద సూర్యాపేట-జనగామ జాతీయ రహదారి 365బి పై ఇటీవల గాలివానకు రోడ్డు వెంట ఉన్న చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. ఆదివారం విద్యుత్ సిబ్బంది తీగలపై కూలిన చెట్టును తొలగించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చివ్వెంల : బండమీది చందుపట్లలో ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తుంగతుర్తి, జూన్ 9 : జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో 1983-1984 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.50 వేల విలువైన కంప్యూటర్ డ్రమ్స్‌ను పాఠశాలకు బహూకరించారు. అనంతరం తమకు విద్యాభ్యాసం నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు మెమో టోలతో ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంకినేని గోపాల్‌రావు, ఎల్లయ్య, చంద్రమౌళి, రుద్ర వెంకన్న, పొద్దున ఉప్పలయ్య, పోలెపాక వీరమల్లు పాల్గొన్నారు.

చివ్వెంల : మండలంలోని బండమీది చందుపట్లలో 36 ఏండ్ల క్రితం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించి ఆనందోత్సహాల నడుమ గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, సోమయ్య, వెంకటయ్య, ఇమామ్, శ్రీను, వెంకన్న, వెంకటనర్సయ్య, పూర్వ విద్యార్థులు భాస్కర్, దేవేందర్, వీరయ్య, యల్లయ్య, వాసు, శ్రీను, మోహన శర్మ, రవి, అనిల్, రాములు, శిరీష, అంజమ్మ, వరలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

మోతె : మండలంలోని సిరికొండ జడ్పీహెచ్ఎస్ 1995-2001లో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు రంగయ్య, నర్సిరెడ్డి, కాసర్ల నర్సిరెడ్డి, రత్నాచారి, వాసుదేవరావు, వాజిత్, విశ్వశాంతి, పూర్వ విద్యార్థులు స్టాలిన్, ఏకస్వామి, రమేశ్, ఉపేందర్, రమణ, స్వప్న, ఉమా, పూజ, ఉప్పమ్మ, కృష్ణవేణి, అశ్విని పాల్గొన్నారు.

గడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో..

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామ జడ్పీహెచ్ఎస్ 1991-92 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులు జానీమియా, వీరారెడ్డి, రామినేని సత్యం, మధును పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీఐ సంధ్యాల సైదులు, మాశెట్టి శ్రీహరి, సంధ్యాల బక్కయ్య, బట్టిపల్లి శ్రీహరి, సలిగంటి నాగయ్య, జక్కి నర్సయ్య, శంకర్, అరవింద్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : తుంగతుర్తిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మోతె : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : గడ్డిపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు